
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
బుధవారం 13 నవంబరు 2024





జఫర్‌గడ్ మండలం దుర్యానాయక్ తండాలో చేపట్టబోయే ఉపాధి పనులపై గ్రామసభ



తమ్మడపల్లి(జి)లో పనిచేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

ఉపాధికి కసరత్తు

- 2025-26 ఏడాదికి పనుల గుర్తింపు
- బడ్జెట్ తయారీకి ఆదేశం
- ఈనెల 30లోపు ప్రణాళిక పూర్తి
- వ్యవసాయాధారిత పనులపై దృష్టి
- గ్రామసభల్లో పనుల ఎంపిక
- ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి చాన్స్
- జిల్లాలో 1.17 లక్షల జాబ్ కార్డులు
- 2.31 లక్షల మంది కూలీలు

జఫర్‌గడ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల ప్రణాళికల రూపకల్పనకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కసరత్తు చేపట్టింది. వచ్చే ఏడాదిలో గ్రామాల్లో చేసే పనుల గుర్తింపు, కార్మిక బడ్జెట్‌ను తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నెల నుంచి జిల్లాలోని ఆయా గ్రామాల్లో పనుల గుర్తింపు చర్యలు చేపడుతున్నారు. గ్రామసభల ద్వారా ప్రక్రియ చేపట్టి గ్రామాల వారీగా ఉపాధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసి పనుల లక్ష్యాన్ని నిర్ధారించనున్నారు. అధికార యంత్రాంగం ప్రతీ ఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. పల్లెల నుంచి వలసలను నివారించి స్థానికంగా జీవనోపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం పేదలకు బాసటగా నిలుస్తోంది. ప్రతీ ఊరిలో ప్రాధాన్య పనులను గుర్తించి కూలీలకు చేతినిండా పని లభించేలా గ్రామసభల్లో ప్రణాళికలను ఆమోదించనున్నారు. సభల్లో సీజన్‌కు కనుగుణంగా పనులను గుర్తిస్తున్నారు. వ్యవసాయ పనుల సీజన్‌లో కూలీల హాజరు తక్కువగా ఉంటుది. వ్యవసాయ పనులు లేని సమయంలో అత్యధిక శాతం మందికి పనులు కల్పించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో గుర్తించిన పనులకు బడ్జెట్‌ను రూపొందించి పంపిస్తారు. అనంతరం కేంద్రం నుంచి పాలనాపరమైన అనుమతుల ఆదేశాలు రాగానే వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక కార్మిక బడ్జెట్ ఆధారంగా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టనున్నారు.

జిల్లాలో 2.31లక్షల మంది కూలీలు..

అధికారిక గణాంకాల ప్రకారం జిల్లాలో 281 గ్రామ పంచాయతీల పరిధిలో 1,17,737 జాబ్ కార్డులు ఉండగా, 2,31,585 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో ప్రస్తుతం 81,073 జాబ్ కార్డులకు చెం దిన 1,35,936 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనుల్లో భాగస్వాములవుతున్నారు. అలాగే జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 677 కూలీల కుటుంబాలు మాత్రమే వంద రోజుల పనిని పూర్తి చేసుకున్నాయి.

వ్యవసాయాధారిత పనులకు పెద్దపీట...

వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే ఉపాధి పనుల్లో వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యమిచ్చారు. అయితే ఈ నిబంధన గతంలోనూ ఉన్నా అమలుకు నోచుకోలేదు. ఈసారి 60శాతం వ్యవసాయాధార పనులు, 40 శాతం ఇతర పనులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ ఉపాధి పనుల్లో ప్రధానంగా వ్యవసాయ నీటి కుంటలు, పంట కాలువల నిర్మాణం, బావులు, చెక్‌డ్యాంలు, కాలువల

మిగతా 8వ పేజీలో...

కూలీలందరికీ పని కల్పించడమే లక్ష్యం

- వసంత, డీఆర్డీవో, జనగామ



కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యం. ఆదశగానే పనులను గుర్తించేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులతో కూడిన ప్రణాళికలను గ్రామసభల ద్వారా రూపొందిస్తాం. జిల్లాలో ప్రణాళికల రూపకల్పన ప్రక్రియ పూర్తికావచ్చింది. పనుల గుర్తింపులో వ్యవసాయాధారిత, ప్రజావరాల పనులకే ప్రాధాన్యమిస్తున్నాం. పని కోరిన కూలీలందరికీ పనులు కల్పిస్తాం. జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు కూడా పనులు కల్పిస్తాం. నిర్దేశించిన సమయానికి జిల్లాలో పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తాం.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

త్వరలోనే ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ గృహాలు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లబ్ధిదారులకు చెక్కులను అందించిన ఎమ్మెల్యే కడియం

జఫర్‌గడ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్‌గడ్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మీ, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. కడియం మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న మూడు నెలల్లోనే కల్యాణలక్ష్మీ చెక్కులను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. త్వరలోనే ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయనుండగా, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి అదనంగా 2,500 ఇళ్లతో మొత్తంగా 6వేల ఇళ్ల మంజూరుకు సీఎం అంగీకరించారన్నారు. ఇచ్చిన హామీలను ఆర్థిక వెసులుబాటును బట్టి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తోందన్నారు. రుణమాఫీపై ఎలాంటి అపోహలు, అనుమానాలు అవసరంలేదని, డిసెంబర్ వరకు అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు పంట రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసి తీరుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఏకకాలంలో మాఫీ చేస్తామన్న గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. రైతుల రూ.లక్ష లోపు పంట రుణాల మాఫీకి ఐదేళ్ల సమయం తీసుకుందని గుర్తు చేశారు. మండలంలోని 30 మందికి కల్యాణలక్ష్మీ, 34 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సమావేశంలో తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, డైరెక్టర్లు ఆయేషా, సురేశ్ నాయక్, బాబు పాల్గొన్నారు.

కరాటేలో ఓబులాపూర్ విద్యార్థి ప్రతిభ

- ప్రపంచ పోటీల్లో బంగారు, వెండి పతకాలు



కరాటేలో బంగారు, వెండి పతకాలతో సార్థక్ కుమార్ గౌడ్

జఫర్‌గడ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓబులాపూర్‌కు చెందిన విద్యార్థి మొగులగాని సార్థక్ కుమార్‌గౌడ్ అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, వెండి పతకాలను సాధించాడు. గోవాలో ఇటీవల జరిగిన ప్రపంచ స్థాయి కరాటే పోటీల్లో సబ్ జూనియర్ స్థాయిలో పాల్గొన్న కుమార్ కటస్ విభాగంలో బంగారు, స్పారింగ్‌లో వెండి పతకాలను సాధించాడు. మాంటిసోరి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. కుమార్‌ను మంగళవారం నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌లో తరలిస్తున్న గడ్డి దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన వరి గడ్డి

రఘునాథపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరి గడ్డికి విద్యుత్తు తీగలు తగలడంతో గడ్డి దగ్ధమైన ఘటన వెల్దిలో మంగళవారం చోటు చేసుకుంది. దాసన్నగూడెంకు చెందిన నకీర్త అనిల్ వెల్దిలో కొనుగోలు చేసిన గడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న క్రమంలో విద్యుత్తు తీగలు తగిలి మంటలు చెలరేగాయి. జనగామ అగ్నిమాపక శకటంతో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పారు. ఎస్‌ఐ డి.నరేష్ ఘటనా స్థలానికి పరిస్థితిని సమీక్షించారు. సుమారు రూ.20వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నర్మెట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం చెందిన గుగులోతు రాజు పీడీఎస్ బియ్యాన్ని గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి భువనగిరి జిల్లాలో ఎక్కువ ధరకు అమ్ముతున్నాడని సమాచారం మేరకు బియ్యం తరలిస్తున్న రాజు పట్టుకున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు. రాజు వద్ద ఉన్న టీవీఎస్ మోపెడ్‌ను నాలుగు క్వింటాళ్ల స్వాధీనం చెసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై మృతదేహంతో రాస్తారోకో

- నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రాణం తీశాడంటూ ఆరోపణ
- రూ.20 లక్షలు నష్టపరిహారం ఇప్పించాలని ఆందోళన
- ఏసీపీ జోక్యంతో ఆందోళన విరమణ



రహదారిపై మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బాధితులు



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ భీంశర్మ

లింగాలఘణపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండలం నెల్లుట్ల శివారు హైద్రాబాద్- హన్మకొండ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళా రైతు శివరాత్రి రాములమ్మ మృతదేహంతో బాధితులు మంగళవారం రాస్తారోకోకు దిగారు. సోమవారం (11న) వ్యవసాయ పనులకు నడుచుకుంటూ వెళ్తున్న శివరాత్రి రాములమ్మ(53)ను అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. పోస్ట్‌మార్టం అనంతరం మంగళవారం స్వగ్రామం నెల్లుట్ల వడ్డెరకాలనీలో అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. అయితే నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్ చేసి ప్రాణాన్ని బలిగొన్న కారు డ్రైవర్‌ను తమకు అప్పగించాలని, రూ.20లక్షల నష్టపరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబం, బంధుమిత్రులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రవణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో చర్చించారు. ఆందోళన విరమించాలని కోరినా పట్టించుకోలేదు. జనగామ స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు పార్థసారథి, భీం శర్మ రంగంలోకి దిగి బాధితులతో చర్చించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సుమారు అరగంట పాటు వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోవడంతో పోలీసులు ప్రత్యామ్నాయంగా వాహనాల రాకపోకలను జనగామ టౌన్ నుంచి దారి మళ్లించారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీసీపీ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

రఘునాథపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిడిగొండలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెస్ట్‌జోన్ జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ మంగళవారం సందర్శించారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీం శర్మ, సీఐ ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, ఎస్‌ఐ దూదిమెట్ల నరేష్ ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాలికలు విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని, అది సాధించేందుకు కృషి చేయాలని జనగామ సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తాటోజు శ్రీనివాసులు అధ్యక్షతన బాలికా సాధికారతా క్లబ్‌ల మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంచి అలవాట్లతో చక్కగా చదువుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. తమ శక్తి సామర్థ్యాలను వంద శాతం వినియోగించుకోవాలని, అప్పుడే సాధికారత సాధిస్తారన్నారు. బాలికలు తమకు ఉండే చట్టపరమైన అంశాలను ఎలా వినియోగించుకోవాలో కూడా తెలియజేశారు. సమావేశంలో ఎంఈవో వంగాల రాజేందర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ మమత, యాస్మిన్, ఉపాధ్యాయులు రమేష్, బి.లక్ష్మి, చందు, పి.అనిత, చంద్రకళ, తెహరా, బి.శేఖకుమార్, నిర్మల, లలిత, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీతో మత్స్యకారుల అభివృద్ధి: డీపీవో

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని జిల్లా పంచాయతీ అధికారి నాగపూరి స్వరూప తెలిపారు. మంగళవారం ఘన్‌పూర్ దేవాదుల రిజర్వాయర్‌లో ప్రభుత్వం అందించిన 4.36 లక్షల ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేప పిల్లలను అందిస్తోందన్నారు.

కార్యక్రమంలో డీఎఫ్‌వో రాణాప్రతాప్, ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, ఘన్‌పూర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మునిగెల వెంకటేశ్వర్లు, గోనెల అనిల్, పొన్నం నాగరాజు, నీల రాజు, వెంకటేశ్వర్లు, కుంభం రాజయ్య, గోనెల కృష్ణ, గోనెల రాజయ్య, గోనెల వెంకన్న, ఉప్పలయ్య తదతరులు పాల్గొన్నారు.



రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేస్తున్న డీపీవో

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్



అధికారులతో చర్చిస్తున్న వ్యవసాయాధికారి రామారావు నాయక్

బచ్చన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి రామారావునాయక్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఏవో విద్యాకర్‌రెడ్డి, పలు సెంటర్ల నిర్వాహకులు, ఏఈవోలతో సమావేశమయ్యారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తున్న రైతుల ధాన్యంను క్రమపద్ధతిలో కాంటాలు వేసి ట్రక్‌చిట్టీలో పేర్లు నమోదు చేసేలా చూడాలన్నారు. కేంద్రాలపై ఎలాంటి ఆరోపణలు వచ్చినా చర్యలుంటాయన్నారు.

ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యంతో పాటు, కేంద్రాలలో ఉన్న ధాన్యం వివరాలపై అంచనాకు వచ్చారు.. వరికోతలు దాదాపు పూర్తవుతున్న దశలో ఇందుకు అనుగునంగా తరలింపు చర్యలు తీసుకోవాలన్నారు.

పాలకమండలిపై సందిగ్ధం

- మల్లన్న ఆలయ పాలకమండలి నియామకంపై నిర్లక్ష్యం
- చైర్మన్ గిరిపై గొల్ల, కురుమ, రెడ్డి కులస్థుల మధ్య పోటీ
- ఆరునెలల క్రితం నోటిఫికేషన్ జారీతో భారీగా దరఖాస్తులు
- నెలన్నరలో కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం

వివరాలు: 8లో



ఉత్సాహంగా భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

విజేతలకు బహుమతులు అందించిన జడ్‌వో స్వరూపరాణి

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి జోన్ 10వ స్పోర్ట్స్ మీట్ పోటీలు రెండో రోజు మంగళవారం మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూల్‌లో ఉత్కంఠ భరితంగా సాగాయి. రెండోరోజు విజేతలకు జడ్‌వో స్వరూపరాణి మెమొంట్లను బహుకరించారు.

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల పరిధిలోని 11 సోషల్ వెల్ఫేర్ గురుకులాల బాలుర జట్లకు అండర్ 14, 17, 19 విభా గంలో ఈ ఈవెంట్స్ ఉత్సాహభరితంగా నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, క్యారమ్, చెస్, హైజంప్, లాంగ్‌జంప్, రన్నింగ్ పోటీలు విద్యా ర్థుల మధ్య హోరెత్తిం చాయి. ఈ పోటీలలో వివిధ గురుకుల పాఠశాలల నుంచి 935 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ దయాకర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివా స్‌రావు, పీడీ వంగ రవి, పీఈటీ వెంకటేశ్వర్లతో పాటు పోటీలలో పాల్గొనే ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు, గైడ్, ఎస్కార్ట్ టీచర్లు, మీడియా ఇన్‌చార్జి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోనల్ క్రీడలు



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ములుగు (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం జోనల్ స్థాయి క్రీడలు ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. 11విభాగాలలో జరుగుతున్న పోటీలలో 950మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. రెండోరోజు మంగళవారం వివిధ క్రీడలలో ప్రతిభ కనబర్చిన వారు విజేతలుగా నిలిచారు. టెన్నికాయిట్ అండర్-14, 17లో జాకారం జట్టు విజేతగా నిలిచింది. చెస్ అండర్-14లో బెల్లంపల్లి, అండర్-19లో ఏటూరునాగారం విజేతలుగా నిలిచాయి. క్యారమ్స్ అండర్-19లో మంథని స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. ఖోఖో-14లో మంథని జట్టు ప్రథమ విజేతగా నిలిచింది. పగలంతా ఆటలతో మైదానంలో సందడి నెలకొంటుండగా సాయంత్రం విద్యార్థులను ఉత్సాహ పరిచేందుకు క్యాంప్ ఫైర్ నిర్వహించారు. విద్యార్థుల కోసం వైద్యాధికారి సీహెచ్.రాములు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. క్రీడోత్సవాలను గురుకులం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఆయా జిల్లాల డీసీవోలు భిక్షపతి, శ్రీనివాస్, యాదగిరి, వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు.

కేయూ తైక్వాండో మహిళా జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నవంబరు 11 నుంచి 15 వరకు అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ తైక్వాండో మహిళ జట్టును సోమవారం ఎంపిక చేసి నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎం పికైన క్రీడాకారుల్లో శిరీష, ఎస్.తేజస్విని, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశా ల, హనుమకొండ), కె.శ్రావణి, (వాగ్దేవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్, వరంగల్), బి.రుద్ర (ఏకశిల డిగ్రీ కళాశాల, జనగామ), పి. నాగలక్ష్మి, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూరు), సీహెచ్, తులసి(నలంద డిగ్రీ కళాశాల, మహబూబాబాద్) ఉన్నట్లు వెల్లడించారు.

ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. రమేశ్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ వెంకయ్య తదితరులు

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ మాదిగ

గోవిందరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుప్రీంకోర్టు తీర్పు ను అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జాతీయ నేత మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. వర్గీక రణ లేకుండానే డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలను పక్కదారి పట్టించి మాది గలు అభివృద్ధి చెందకుండా మోసం చేశారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ విషయమై డిసెంబరు 21న హైదరాబాద్‌లో జరిగే మాదిగల ధర్మయుద్ధ మహా సభను నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షు డిగా ఎనగందుల మొగిలయ్య, ప్రధాన కార్యదర్శిగా బొచ్చు అరవింద్, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా పసుల భద్రయ్య, అధికార ప్రతినిధిగా బుర్రి వెంకటేశ్, ఎంఎస్ఎఫ్ అధ్యక్షులుగా పెండ్యాల విజయ్, గంగారపు అశ్వనితేజ్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కరు ణాకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పేరాల బలరాం, తోకల రాంబాబు, కొయ్యడ శ్రీకాంత్, నద్దునూరి రతన్, మచికలపూడి రతన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గురుకులం విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్

కాటారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా (ఎస్‌జీఎఫ్‌ఐ) రాష్ట్ర స్థాయి పోటీల్లో కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. హ్యాండ్‌బాల్ అండర్-19, అండర్-14 పోటీల్లో ప్రథమ స్థానంతో గోల్డ్ మెడల్స్ సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టులో గురుకులం విద్యార్థులు తొమ్మిది మంది ఉన్నారు. అండర్-19 విభాగంలో గోల్డ్ మెడల్ సాధిం చిన ఏడుగురి జట్టులో గురుకులానికి చెందిన కాటారం హ్యాండ్‌బాల్ అకాడమీ క్రీడాకారులు టి.జితేందర్, బి.వంశీ, బి. చందర్, బి.నరేష్, ఎం. సాయితేజ, జె.శేషు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు కోచ్‌గా గురుకులానికి చెందిన వెంకటేశ్ వ్యవహరించగా టి.జితేందర్ కెప్టెన్‌గా వ్యవహరించి ఉత్తమ క్రీడాకారుడు అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ బి.లాల్ తెలిపారు.అలాగే హ్యాండ్‌బాల్ అండర్-14 విభా గంలో అత్యంత ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించిన జట్టులో గురుకు లానికి చెందిన విద్యార్థులు బి.అజయ్, బి.దేవేందర్, ఎం.శ్రీధర్ ఉన్నారు. అత్యుత్తమ ప్రతిభతో గురుకులానికి మంచి పేరు తెచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ లాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, అధ్యాపకులు వెంకటయ్య, బలరాం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యో గుల (టీజీవో) సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ కోరారు. ఇటీ వల ఎన్నికైన టీజీవో జిల్లా కార్యవర్గం మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కు మార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్స ల్ టొప్పో, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులను కలి శారు. ఈ సందర్భంగా టీజీవో జిల్లా అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ.... తెలంగాణ గెజిటెట్ అధికారుల సంఘం భవన నిర్మాణ కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొప్పు ప్రసాద్, వేముల సురేష్, హరిప్రసాద్, బి. రాజశేఖర్, డాక్టర్ నరేష్, పి. సదా నందం, సోమ్లానాయక్, పి.రాజేంద్రప్రసాద్, గణేష్, శ్రీనివాస్, అప్సర్ పాషా, మున్వర్‌బేగ్, వీరన్న, జోత్స్న పాల్గొన్నారు.

విద్యార్థి దశలో చదువు ముఖ్యం

మరిపెడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చదువు ప్రధానమని మహబూబాబాద్ షీ టీం ఎస్సై సునంద అన్నా రు. మంగళవారం మండలంలోని ఎల్లంపేట హైస్కూల్‌లో విద్యా ర్థులకు ఏహెచ్‌టీయూ, భరోసా, సైబర్ క్రైమ్‌లపై అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికల భద్రత షీ టీం లక్ష్యమన్నారు. పాఠశాలలో కాని ఇతర ప్రదేశాలలో ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురి చేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడినా వెంటనే వాట్సాప్ నెంబరు 87126 56935 కు సమాచారం అందివ్వాలన్నారు. ప్రయాణాలలో మహిళలు, విద్యార్థి నీలు ట్రావెల్ షేప్ యాప్ (టీ సేఫ్)ని ఉపయోగి ంచాలన్నారు. సమాజంలో మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువ వేధిం పులకు గురతున్నారని, అలాంటప్పుడు జాగ్రత్త పడాలన్నారు. కార్యక్ర మంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రావు, షీ టీం సిబ్బంది పార్వతి, రమేష్, మరిపెడ పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఉమా మహే శ్వరరావు, రమేష్, శ్రీను, భరోసా సపోర్ట్ పర్సన్ బేబి పాల్గొన్నారు.



ఎల్లంపేట హైస్కూల్‌లో మాట్లాడుతున్న షీ టీం ఎస్సై సునంద

ఇళ్లు నిర్మించాలని పేదల నిరసన

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

గోవిందరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పేదలు మంగళవారం నిరసనకు దిగారు. ములు గు జిల్లా గోవిందరావుపేటలోని జాతీయ రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దా ర్ కార్యాయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు మాట్లాడుతూ పస్రాలోని సుందరయ్యనగర్‌లో గల 109సర్వే నంబర్‌లో 500మంది నిరుపేదలు నివసిస్తున్నారని, వారికి ప్రభుత్వం పట్టాలు అందించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా 109ఈ/అ సర్వే నంబర్‌లో పుల్యాల వసంత పేరుతో ఇచ్చిన అక్రమ పట్టాను రద్దు చేయాలన్నారు. దయ్యాలవాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి ప్రభుత్వ భూమికొనుగోలు పథకం కింద ఇళ్లు నిర్మించి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని, ప్రాజెక్టునగర్ ప్రజలకు ప్రభుత్వం సురక్షితమైన ప్రాంతంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతర ఆర్ఐ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అంబాల మురళి, గొంది రాజేష్, గుండు రామస్వామి, కడారి నాగరాజు, గుండు లెనిన్, కాప కోటేశ్వర్‌రావు, కందుల రాజేశ్వరి, మంచాల కవిత, గోపిశెట్టి ఐలయ్య, కృష్ణారావు, అరుణ్, జీవన్, వల్లపు రాజు, మంచోజు బ్రహ్మచారి, రాజేశ్వరి, సువర్ణ, శారద, సరిత పాల్గొన్నారు.


వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2465	2080
పల్లికాయ (సూక)	5900	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	---	---
పెసళ్లు	6012	5900
పత్తి	7000	6300
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	11781	10023
పసుపు (గోల)	10806	4040
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	17000	14000
వండర్‌హాట్ ఏసీ	14200	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలి

- యూత్, మహిళా నాయకులను ప్రోత్సహించాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతం కోసం నాయ కులు గ్రామస్థాయిలో కృషి చేయాలని పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం పెద్దవంగర, తొర్రూరు మండలాల్లోని వివిధ గ్రామాల ముఖ్యకార్యకర్తలతో నిర్వ హించిన ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎన్నికల్లో కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. రాబోయే స్థానిక ఎన్ని కల్లో పార్టీ గెలుపు కోసం మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలప ర్చిన అభ్యర్థి గెలుపుకోసం సైనికుల్లా నిలబడాలని, కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని తెలిపారు.

నియోజకవర్గంలో యూత్‌కు, మహిళా కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తూ వారిని ప్రోత్సహించాలని, స్థానిక ఎన్నికల్లో మహిళల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. కొత్త, పాత తేడా లేకుండా ప్రతి ఒక్కరు పార్టీ గెలుపుకోసం పనిచేయాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందరికి అలాగే కృషి చేయాలన్నారు. ఇటీవల ప్రారంభించిన కులగణన బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడు తుందని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టి రిజర్వేషన్లు చేసి సామాజిక న్యాయాన్ని సంపూర్ణంగా ప్రభుత్వం అమలు చేస్తుం దన్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నారని, కార్యకర్తలే పార్టీకి పట్టు కొమ్మలు, అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న ఇతర పార్టీ నాయ కులకు దిమ్మతిరిగేలా సమాధానం ఇవ్వాలని, సోషల్ మీడియాలో కో ఆర్డినేటర్లు ఉత్సాహంగా పని చేయాలన్నారు.

నవంబర్ 20వ తేదీ వరకు జరిగే ఈసర్వే విజయవంతంగా పూర్త య్యేం దుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీసీసీ సభ్యుడు కె.నిరంజన్‌రెడ్డి, సోమేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు హమ్యానాయక్, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పింగిళి ఉష, నాయకులు పాల్గొన్నారు.

స్టడీ



ఎస్డీఎల్సీఈ కేంద్రం

దూరవిద్యతోనూ ఉజ్వల భవిష్యత్

- అందరికీ అందించడమే లక్ష్యంగా ఎదిగిన ఎస్డీఎల్‌సీఈ
- ఆధునిక పద్ధతుల్లో బోధనకు కసరత్తు
- డిజిటల్ ఎడ్యుకేషన్ దిశగా అడుగులు

కేయూ క్యాంపస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకమైందిగా పేరుతెచ్చుకుంది. పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేస్తోంది. 1989లో ఎంఫిల్ కోర్సుతో పురుడు పోసుకున్న కేయూ దూరవిద్య కేంద్రం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న డిజిటల్ మోడ్ ఎడ్యుకేషన్‌ను కేయూ దూరవిద్య కేంద్రం పుణికిపుచ్చుకుని దేశంలోని అన్ని వర్సిటీలకు దీటుగా సేవలందిస్తోంది. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ కేతవరపు రామకోటిశాస్త్రి మొదలు ప్రొఫెసర్లు మురళీ మనోహర్, వాసిరెడ్డి భాస్కర్‌రావు, కూరపాటి వెంకట నారాయణ, రవిప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఎస్.లింగమూర్తి, చింతకాయల దినేశ్‌కుమార్, ఎస్.విజయ, ఎర్రగట్టు స్వామి, గుగులోత్ వీరన్న తదితర డైరెక్టర్లు ఈ కేంద్రానికి దశదిశను చూపారు. మారుతున్న కాలానికనుగుణంగా యూజీసీ డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) నూతన విధానాలను తీసుకొచ్చింది. దేశంలో ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రెగ్యులర్ కోర్సులతో పాటు దూరవిద్య కేంద్రం అందిస్తున్న కోర్సులకు సమాన ప్రాధాన్యం కల్పించింది. యూజీసీ డెబ్ తీసుకున్న నిర్ణయాలు దేశంలోని దూరవిద్య కేంద్రాలకు గుదిబండగా మారాయి. వెంకటేశ్వర వర్సిటీ దూరవిద్య విధానానికి అనుమతి రద్దు చేసింది.

అలాగే నాగార్జున వర్సిటీకి కొన్ని కోర్సులకు అనుమతి నిరాకరించింది. వీటితో పాటు అనేక వర్సిటీల దూరవిద్య కేంద్రాలకు అనుమతులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో వరంగల్ ఎస్డీఎల్‌సీఈని కాపాడేందుకు ప్రస్తుత ఎస్డీఎల్‌సీఈ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉన్న కేంద్రాన్ని మూసివేయకుండా పునర్వైభవం తెచ్చేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

సెమిస్టర్ పుస్తకాల ముద్రణ

యూజీసీ డెబ్ నిబంధనల మేరకు ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ మొదటి సెమిస్టర్ కోర్సులకు ప్రామాణిక పుస్తకాలను ముద్రించింది. సైకాలజీ, ఇంగ్లిష్, సోషియాలజీ, సోషల్ వర్క్స్, సంస్కృతం, హిందీతో పాటు ఇతర అన్ని కోర్సుల పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందిస్తోంది.

తరగతుల నిర్వహణ

కొవిడ్ కారణంగా పనిచేసుకుంటూ చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొనగా.. చదువుపై ఆసక్తి కలిగిన వారు పని చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధిస్తున్నారు. తరగతులకు వెళ్లని వారికి పుస్తకాలు, పాఠ్యాంశాలు అశనిపాతంగా మారాయి. 2023-24 ఏడాది నుంచి తప్పనిసరిగా డిగ్రీ, పీజీ కోర్సుల్లో సెమిస్టర్ విధానాన్ని అనుసరించాలని నిబంధనలు పెట్టింది. గతంలోనూ సెమిస్టర్ బోధన చేయాలని చెప్పినా ఏడాదికేడాది సెమిస్టర్ విధానాన్ని వాయిదా వేస్తోంది. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరుగుతోంది. ఏడాదిలో కోర్సులను బట్టి తరగతులు ఏర్పాటు చేస్తారు.

12 వేల మంది విద్యార్థులకు బోధన

దూరవిద్య కేంద్రంలో ప్రస్తుతం 12 వేల మంది విద్యార్థులకు యూజీ, పీజీతో పాటు ఇతర డిప్లొమా కోర్సుల్లో విద్య అందుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో స్టడీ సెంటర్లు ఉండగా యూజీసీ నిబంధనల మేరకు వర్సిటీ విస్తరించిన ఉన్న ప్రాంతాల్లోనే ఎస్డీఎల్‌సీఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే నిబంధనతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ పరిధిలోనే స్టడీ సెంటర్లు, పరీక్షల కేంద్రాలను కుదించింది. ఒకప్పుడు దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులకు చాలా రకాల కోర్సులను అందించిన కేయూ దూరవిద్య కేంద్రం ప్రస్తుతం బీకాం, బీకాం కంప్యూటర్స్, ఎంఏ, ఎంఎస్సీ అందిస్తోంది. మొత్తం 33 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తోంది. బీఏ, బీకామ్, బీఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో తదితర కోర్సులకు నిర్వహిస్తోంది.

ఇక నుంచి అంతా ఆన్‌లైన్‌లోనే..

కేయూ దూరవిద్య కేంద్రం పూర్తిగా ఆన్‌లైన్‌కి అప్‌గ్రేడ్ అవుతోంది. జనవరి మొదటివారంలో ఎస్డీఎల్‌సీఈ నూతన సాఫ్ట్‌వేర్ విధానాన్ని అనుసరించనుంది. వెబ్‌ను రూపొందించారు. ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే అనుభజ్ఞులైన ప్రొఫెసర్లతో అన్ని విభాగాల పాఠ్యాంశాలు, వీడియో పాఠాలను రికార్డు చేసేందుకు ఆధునిక వీడియో ల్యాబ్‌ను ఎస్డీఎల్‌సీఈలో అందుబాటులోకి తెచ్చారు. ఒక్కసారి వీడియో, ఆడియో పాఠాలను రికార్డు చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే విద్యార్థులకు వీలైనప్పుడు చూడవచ్చు. దూరవిద్యలో అడ్మిషన్లు, సర్టిఫికెట్ల జారీ, సమస్త సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తామని డైరెక్టర్ రామచంద్రం వెల్లడించారు. అలాగే ట్రాకింగ్ సిస్టంను అందుబాటులోకి తేనున్నారు. దీంతో తమ దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయి. తమకు ఎస్డీఎల్‌సీఈ సేవలు ఎప్పుడు లభిస్తాయో తెలుసుకునే వీలు కలుగుతోంది.

కేయూ ఎస్డీఎల్‌సీఈకి అంతర్జాతీయ గుర్తింపు

వరంగల్ కేయూ దూరవిద్య కేంద్రం అంతర్జాతీయ గుర్తింపు పొందింది. యూజీ, పీజీ కోర్సులతో పాటు దేశంలోని ఏ వర్సిటీలో లేని ప్రొఫెషనల్ కోర్సులను అందించింది. న్యాయశాస్త్రం, ఎడ్యుకేషన్ అందించింది. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో అత్యున్నత ఉద్యోగాలు పొందారు. దూరవిద్య సెలబస్ ప్రామాణికంగా ఉంటుందని గుర్తింపు లభించింది. ఎస్డీఎల్‌సీఈలో చదివిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1, 2 అధికారులు, టీచర్లు, పోలీసులు, లాయర్లు, ఇతర ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవలందిస్తున్నారు.

డిగ్రీ అడ్మిషన్‌కు తప్పనిసరి ఇంటర్

కేంద్ర ప్రభుత్వం యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు తప్పనిసరిగా ఇంటర్/తత్సమాన విద్యార్హతను నిర్ణయించింది. గతంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించే విధానానికి స్వస్తి పలికారు. రెగ్యులర్/ ఓపెన్ ఇంటర్ చదివిన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నారు. దూరవిద్య కేంద్రంలో డిగ్రీ కోర్సుల్లో చదివే వారి సంఖ్య పడిపోతుంది. అలాగే వర్సిటీ పరిధిలోని జిల్లాల్లోనే స్టడీ సెంటర్లతో పాటు పరీక్షల కేంద్రాల ఏర్పాటు చేయాలనే నిబంధనలు వర్సిటీ దూరవిద్య కేంద్ర అభివృద్ధికి అటంకంగా మారాయి. గతంలో వందల సంఖ్యలో స్టడీ సెంటర్లు వేలాది సంఖ్యలో ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 44 స్టడీ సెంటర్లు ఉన్నాయి.

ఎస్డీఎల్‌సీఈలో అన్ని కోర్సులకు అనుమతి

వల్లూరి రామచంద్రం, కేయూఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్



ఎంఏ తెలుగు, సైకాలజీతో పాటు బీఏ కోర్సులకు యూజీసీ డెబ్ నిబంధనల మేరకు అన్ని అర్హతలున్నా కోర్సులకు అనుమతులు తీసుకువచ్చాం. విద్యా రంగంలో వస్తున్న డిజిటల్ టెక్నాలజీ, స్వయం పోర్టల్ కోర్సుల నేపథ్యంలో కేయూ దూరవిద్య కేంద్రాన్ని ఎప్పటికప్పుడూ అప్‌గ్రేడ్ చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన, ప్రామాణిక విద్యను అందిస్తున్నాం. దూరవిద్య కోర్సులన్నీ రెగ్యులర్ విద్యకు సమానమని యూజీసీ నిర్ణయించిన నేపథ్యంలో పాత పద్ధతులు పోయి నూతన విధానాలను తీసుకువస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. కేయూ ఎస్డీఎల్‌సీఈకి పునర్వైభవం తీసుకొస్తాం.

రావమ్మా మహాలక్ష్మి..

ఆడబిడ్డకు పూలబాటతో స్వాగతం



కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వారికి తొలుత ఇద్దరు కుమారులు జన్మించారు. కానీ అమ్మాయి కావాలన్న ఆకాంక్ష నెరవేరకపోవడంతో ఆ దంపతులు మూడోసంతానం కోసం వేచిచూశారు. ఈ క్రమంలో మూడో సంతానంగా అమ్మాయి జన్మించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమ కుటుంబంలోకి 'మహాలక్ష్మి' ఆడపిల్ల రూపంలో వచ్చిందని ఆ దంపతులు, కుటుంబసభ్యులు పూలబాట వేసి స్వాగతం పలికారు. మహ బూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన పొడకంటి క్రాంతికుమార్, సుమ దంపతులకు ఈనెల 10న మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఆడపిల్ల జన్మించింది. మంగళవారం సుమ డిశ్చార్జి అయి కూతురితో తమ ఇంటికి రాగా కుటుంబస భ్యులు పూలబాట ఏర్పాటు చేసి 'రావమ్మా మహాలక్ష్మి' అంటూ ఆ శిశువుకు స్వాగతం పలకడం విశేషం. ఆడపిల్లపై అంతలా ప్రేమానురాగాలు చూపిస్తున్న ఆ కుటుంబాన్ని చూసి పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రైట్.. రైట్.. పోనియ్ బాస్..
కోతుల పని పడదాం



కోతుల నుంచి పంటలను కాపాడుకునేందుకు కేసముద్రం మండలం కల్వలకు చెందిన రైతు ఆకుల సుధాకర్ కొన్నేళ్లుగా కొండెంగను పెంచుతున్నాడు. కొండెంగను చెల్కవద్దకు తీసుకువెళ్లగానే పంటపొలాల పరిసర ప్రాంతాల్లో ఉన్న వానరాలు కంటికి కానరాకుండా పారిపోతున్నాయి. దీంతో ఆయన నిత్యం కొండెంగను ఇంటి నుంచి చెల్క వద్దకు ఇలా బైకుపై తీసుకువెళుతుంటాడు. ఈ క్రమంలో ఆ కొండెంగ కూడా సుధాకర్ పిలవగానే రైట్.. రైట్ పోనియ్ బాస్... కోతుల పని పడదాం.. పదా..' అన్నట్టుగా బైకుపై వెనుక కూర్చోవడం అలవాటు చేసుకుంది. రోజులాగే మంగళవారం కొండెంగను చెల్కవద్దకు తీసుకెళుతూ కనిపించారు సుధాకర్.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

కానిస్టేబుళ్లకు అతి ఉత్కృష్ట సేవా పతకాలు


మల్లారెడ్డి


మహేశ్

హనుమకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే అతి ఉత్కృష్ట సేవా పతకానికి కేయూసీ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మల్లారెడ్డితోపాటు హనుమకొండ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.మహేశ్‌లు ఎంపికయ్యారు. అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన మల్లారెడ్డి దామెర మండలం కొగిలివాయి గ్రామానికి చెందినవారు. 1990లో పోలీసు కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరి గూడూరు, కొత్తగూడ, సంగెం, సుబేదారి పోలీసు స్టేషన్లలో పని చేసి పోలీసు జిల్లా అధికారుల నుంచి పలు రివార్డులు, ప్రశంసాపత్రాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవ, ఉత్తమ సేవా పతకాలను మల్లారెడ్డి అందుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన మహేశ్ 1996లో కానిస్టేబుల్‌గా చేరి సీసీఎస్, మిల్స్‌కాలనీ, జనగామ పోలీసు స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వహించి అధికారుల నుంచి పలు రివార్డులతోపాటు జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అతి ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపికైన మల్లారెడ్డి, మహేశ్‌లను పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అభినందించారు.

పట్టుదలే ఆమె మనోధైర్యం

- పేదరికాన్ని అధిగమించి రాణించిన యాకమ్మ
- ఇంటర్‌లో వివాహమైనా నిత్యవిద్యార్థిగా ఎదిగిన పేద మహిళ
- ఉపాధ్యాయురాలిగా విధులు.. సాహితీ రంగంలోనూ గుర్తింపు

స్ఫూర్తి


డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల... కృషి.. సమయస్ఫూర్తి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని రుజువు చేశారు నిరుపేద దళిత మహిళ డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ. మహబూబాబాద్ పట్టణానికి చెందిన రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబంలో జన్మించిన యాకమ్మ.. తన తల్లిదండ్రులు అబ్బయ్య, అబ్బమ్మ పడిన కష్టాలను చూస్తూ పెరిగారు. ఎలాగైనా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తల్లిదండ్రుల స్థోమతకు తగ్గట్టుగా ఆమె ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారు. గుమ్ముడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ నుంచి 5వ తరగతి వరకు, స్థానిక బాలికోన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. అయితే ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు పూర్తికాగానే తల్లిదండ్రులు 1996లో మహబూబాబాద్ పట్టణానికి చెందిన సోమారపు వీరస్వామితో వివాహం చేశారు. మే నెలలో ఇంటర్ ఫలితాలు రాగా యాకమ్మ ఇంగ్లీష్‌లో ఫెయిల్ అయింది. వెంటనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన యాకమ్మ ఉత్తీర్ణత సాధించారు. ఈ క్రమంలో యాకమ్మకు చదువుపై ఉన్న శ్రద్ధ, ఆసక్తిని గమనించిన భర్త వీరస్వామి ఆమెను ప్రోత్సాహించారు. అదేసమయంలో ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సీటు రాగా.. ఆమెతో పాటు అక్కడే గది అద్దెకు తీసుకుని ఆయన ఆటోడ్రైవర్‌గా ఉంటూ ఆమెను చదివించారు. అలా 1996-1999లో డిగ్రీ పూర్తిచేసిన ఆమె 1999-2000 విద్యాసంవత్సరంలో తెలుగు పండిట్‌లో ప్రవేశం పొంది హన్మకొండ ప్రభుత్వ బీఈడీ కళాశాలలో పండిట్ కోర్సు పూర్తిచేశారు. 2000-2002లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగులో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిచేశారు. 2001లో నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. 2002 సంవత్సరం చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో కురవి మండలంలోని కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధుల్లో చేరారు. అయినా ఆమె పట్టుదలతో నిత్యవిద్యార్థినిగా రాణించారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ బన్న ఐలయ్య ప్రోత్సాహం, ఆశిస్సులతో పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను పూర్తిచేశారు. తమిళనాడు మధురై కామరాజ్ యూనివర్సిటీలో 2005 సంవత్సరంలో ఎంఫిల్ పట్టా అందుకున్నారు. 2013లో స్టేట్ ఎలిజిబిలిటి టెస్ట్(సెట్), 2014లో నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్(నెట్)కు అర్హత సాధించారు. 2016లో ద్రవిడ యూనివర్సిటీ కుప్పంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. 2017లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ (సంస్కృతం) పూర్తిచేశారు.


యాకమ్మను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు (ఫైల్)

ఆమె కూతురు గాయత్రి ఎంబీబీఎస్ కాకతీయ మెడికల్ కళాశాలలో పూర్తి చేశారు. కుమారుడు కళ్యాణ్ హైదరాబాద్ ఎంజీఐటీలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నారు. ఇంటర్‌లో ఫెయిలైనా నిరుత్సాహ పడకుండా చదువే జీవితంగా పట్టుదలతో ఉన్నత శిఖరాలను అందుకున్న యాకమ్మ నేటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పత్ర సమర్పణలు చేశారు.

ముద్రించిన పుస్తకాలు

2017లో బోయ జంగయ్య సాహిత్య అనుశీలన, 2018లో మమతల మల్లెలు-కథల సంపుటి, 2019లో జగడం ఒక పరిశీలన, 2020లో కెరటం దళిత నవల, రక్షణ కథల సంపుటి, 2021లో మట్టిబంధం కవితా సంపుటి, 2022లో దుఃఖనది కరోనా కథలు.

అందుకున్న అవార్డులు..

యాకమ్మ చదువులోనే కాదు సాహితీ రంగంలో కూడా తనదైన ముద్ర వేశారు. అనేక కథలు, కవితలు, నవలలు, రచనలు చేసి అవార్డులు అందుకున్నారు. 2017లో మదర్ ఫౌండేషన్ వరంగల్ సేవా రత్న జాతీయ అవార్డు, కాలగమనం కథకు అక్షరాలతోవకు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి, 2018లో అక్షర శిఖరం కవితలకు జాతీయస్థాయి పురస్కారం, 2019లో బిఎస్ రాములు ప్రతిభా పురస్కారం, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, కెరటం నవలకు ద్వితీయ బహుమతి, మమతల మల్లెలు కథా సంపుటికి డాక్టర్ పుట్ల హేమలత స్మారక పురస్కారం, సాహితీరత్న పురస్కారం, సాహితీసేవ పురస్కారాలు, 2022లో రాష్ట్ర ఉత్తమ రచయిత అవార్డు, కలెక్టర్, ఎంపీల చేతుల మీదుగా ఉత్తమ రచయిత అవార్డు, మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ కవితా పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2023లో నందివాడ రత్నశ్రీ, పర్సా సైదులు స్మారక పురస్కారాలు, జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రథమ బహుమతి పురస్కారం, వెన్నెల గొడుగు కవితకు జాతీయస్థాయి ఉత్తమ కవిత పురస్కారం, 2024లో కెరటం నవలకు ఉత్తమ గ్రంథ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

స్వయం ఉపాధితో.. సాధికారత వైపు

- ఉపాధి రంగంలో సుస్థిరత కోసం మహిళల ముందడుగు
- యూనిట్ల ఏర్పాటులో ఇల్లంద మహిళల ముందంజ
- జిల్లా, రాష్ట్రస్థాయిలో పురస్కారాలు
- రుణాల మంజూరులో ఏపీఎం, సీసీల తోడ్పాటు
- ఉమ్మడి జిల్లా ఓరుగల్లు సమాఖ్య పదవుల్లోనూ ఇక్కడి మహిళలే..
- చైతన్యం చాటుతున్న ఇల్లంద అతివకు గవర్నర్ ప్రశంస

స్ఫూర్తి


రాష్ట్రస్థాయి స్త్రీ శక్తి అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లంద మహిళలు (ఫైల్)


రజితను ప్రశంసిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ (ఫైల్)

మహిళా సంఘాలకు గవర్నర్ ప్రశంస

వరంగల్ జిల్లాలో ఉన్న స్వయం సహాయక మహిళా సంఘాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన సెర్ప్ డైరెక్టర్లు, బ్యాంకు రాష్ట్రస్థాయి అధికారులకు నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఇల్లందకు చెందిన కొంగ రజితకు మాట్లాడే అవకాశం వచ్చింది. ఉపాధిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రజి తను సెర్ప్ సీఈవో సంపదీప్ సుల్తాన్యా చేతుల మీదుగా సైతం గతంలో రాష్ట్రస్థాయి స్త్రీ శక్తి అవార్డును వర్ధన్నపేట మండలం సొంతం చేసుకుంది. ఇలా జిల్లా, రాష్ట్ర స్థాయిలో వరంగల్ జిల్లా స్వయం సహాయక సంఘాలు ముందంజలో ఉండడం అధికారులు, మహిళల సమన్వయం, చైతన్యమే కారణంగా చెప్పుకుంటున్నారు.

వర్ధన్నపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఉద్యోగాలు చేయడం గొప్పగా భావిస్తున్న సమయంలో వారే యజమానులుగా మారి మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తూ మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం తోడవడంతో మరింత మెరుగైన ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు. కుటీర పరిశ్రమల నుంచి వ్యవసాయం, పాడి, ఆధునిక సాంకేతిక ఉపాధి వైపు మళ్లుతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం పొదుపు చేయడం, రుణాలు తీసుకోవడంతోనే సరిపెట్టకుండా తమ కాళ్లపై తాము నిలదొక్కుకునేలా ఉపాధికి బాటలు వేసుకునేందుకు ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అవకాశాలు కల్పిస్తోంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఈ అవకాశాలను వినియోగించుకోవడంలో ముందంజలో ఉందనే చెప్పాలి.

ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొందడంలో సైతం ప్రభుత్వ లక్ష్యానికి దగ్గరగా పని చేస్తున్నారు. జిల్లాలో 11 మండలాలకు గాను 11,438 స్వయం సహాయక సంఘాలు ఉండగా, 435 గ్రామైక్య సంఘాలున్నాయి. ఈ సంఘాల్లోని మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన మైక్రో ఎంటర్ ప్రైజెస్ (విలేజ్ న్యూ ఎంటర్‌ప్రైజెస్) పేరుతో ప్రత్యేకంగా వ్యాపారాల ఏర్పాటుకు రుణాలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 6352 మందిని లక్ష్యంగా నిర్ణయించగా వందశాతం స్వయం సహాయకులను గుర్తించి యూనిట్లు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

మహిళల ముందంజ..

వర్ధన్నపేట మండలం ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధిస్తోంది. ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో 427 యూనిట్లకు గాను ఇప్పటికే 300 మందికి పైగా అందించారు. ఇక రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు ఇచ్చే ఇందిరా మహిళా శక్తి పథకంలో సైతం ముందంజలో ఉన్నారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను ఈ ఏడాది రూ. 45 కోట్ల టార్గెట్ పెట్టగా, రూ.18 కోట్ల రుణాలు అందించడంతో పాటు మరో 15 కోట్ల వరకు ప్రాసెస్‌లో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇక మండలంలోని ఇల్లందలో పీఎంఈజీపీ పథకం కింద దాదాపు 10మందికి పైగా రూ.10 లక్షల రుణాలు అందించడంలో అధికారులు సఫలీకృతమయ్యారు. వర్ధన్నపేట ఏపీఎం వేణు, సీసీ గోలి కొమురయ్యలు బ్యాంకు మేనేజర్లతో స్వయంగా మాట్లాడి మహిళలను ప్రోత్సహించడంలో సత్ఫలితాలు సాధిస్తున్నారు.

అధ్యక్ష స్థానాల్లోనూ పెద్దపీట

ఉమ్మడి జిల్లా మహిళా సంఘాల అధ్యక్ష స్థానాల్లోనూ వర్ధన్నపేట మండలం తనదైన ముద్రను వేసుకుంటోంది. మొట్ట మొదటిగా సారిగా ఉమ్మడి జిల్లా మహిళా సమైక్య సంఘానికి, ప్రస్తుత మునిసిపాలిటీ కౌన్సిలర్ తోటకూరి రాజమణి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా ఓరుగల్లు మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా ఇల్లంద గ్రామానికి చెందిన ఎడ్ల అరుణ వ్యవహరిస్తున్నారు.

గతంలో వరంగల్ జిల్లాకు కడారిగూడెం గ్రామానికి చెందిన చెన్న సమ్మక్క, గోలి రజితలు వ్యవహరించారు. ఇలా ప్రతిసారి ఉమ్మడి, జిల్లా స్థాయిలో వర్ధన్నపేట మండలానికి పెద్ద పీట వేస్తూ మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు.

పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోలి కొమురయ్య, సీసీ, ఇల్లంద



ఇల్లంద గ్రామ మహిళల్లో ఉపాధి మార్గం ఎంచుకోవాలనే తపన ఉంది. దీని ద్వారా ఉత్పత్తులు, సర్వీస్ అందించే కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. ఈ క్రమంలో పలు ఉత్పత్తుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయించాం. కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, రెడీమెడ్ గార్మెంట్స్, ఫొటో స్టూడియో, ఇంటర్‌నెట్ సెంటర్, ఆయిల్ మిల్లు, పిండి గిర్ని వంటి వాటిని ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళల్లో చైతన్యం నింపడం సంతోషంగా ఉంది.

మహిళలు ఆర్థిక సాధికారత దిశగా నడవాలి

వేణు, ఐకేపీ ఏపీఎం, వర్ధన్నపేట



మహిళలు ఆర్థిక సాధికారత దిశగా నడవాలి. ఉపాధి మార్గాల్లో మెరుగైన యూనిట్‌ను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలనేదే మా ఆలోచన. ఇందు కోసం జిల్లాస్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అధికారులు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. డీఆర్డీఏ పీడీ, ఏపీడీ, డీపీఎం అధికారుల సహకారంతో వర్ధన్నపేట మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ కింద రుణాల లక్ష్యాన్ని కూడా అందుకుని మహిళలను ఆర్థికంగా బలోపేతమయ్యేలా చేస్తాం.

నెలకు రూ.60 వేలు సంపాదిస్తున్నా

కె.రజిత, కంప్యూటర్ ఎంబ్రాయిడర్, ఇల్లంద



గతంలో నేను మిషన్ కుట్టేదాన్ని. 2009లో మణికంఠ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి పొదుపులు, రుణాలు తీసుకునేదాన్ని. కానీ మారిన ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను తీసుకువచ్చాయి. ఆ వివరాలను తెలుసుకుని స్వయం ఉపాధి కోసం కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ షాపు పెట్టాలనుకున్నా. పీఎంఈజీపీ స్కీంలో 35శాతం సబ్సిడీతో రూ.10లక్షల లోన్ మంజూరైంది. ఇప్పుడు నెలకు రూ.40వేల నుంచి 60వేల వరకు సంపాదించడంతో పాటు మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నా.

మహిళలను చైతన్యం చేస్తున్నా..

ఎడ్ల అరుణ, ఓరుగల్లు మహిళా సమాఖ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు



ఈ ఏడాది నిర్వహించిన మహిళా సమాఖ్య ఎన్నికల్లో ఇల్లంద నుంచి నాకు ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా అవకాశం దక్కింది. బృందావన మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న నేను అందరి ప్రోత్సహించడంతో ఈ పదవి చేపట్టా. నిత్యం మహిళలను చైతన్య వంతులను చేయడంలో ముందుంటా. ఇప్పటికే ఉపాధి మార్గాలు ఎంచుకోవడంతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్నా.



నివేదన

వేంకన్నకు సువర్ణ పుష్పార్చన

చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న దేవాలయంలో సువర్ణ పుష్పార్చన ఘనంగా చేపట్టారు. ప్రతీ మంగళవారం నిర్వహించే వేడుకల్లో భాగంగా రూ.40లక్షల విలువైన 108 స్వర్ణాలతో స్వామివారి పాదాలను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు - కిరణ్మయి దంపతులు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న,జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్ పాల్గొన్నారు.

-చిలుపూర్



నిర్లక్ష్యం

నర్సరీ దాటని మొక్కలు

అక్కపల్లిగూడెం నర్సరీలో జీపీ ఆధ్వర్యంలో పెంచిన ఈత మొక్క లను నాటకుండా వదిలేశారు. నర్సరీలలో మొలకెత్తిన ఈత మొక్క లను ఎక్సైజ్ అధికారులు తీసుకెళ్లి గ్రామాల్లో గీత కార్మికుల సహకా రంతో చెరువు, కుంట కట్టల పైన నాటించాల్సి ఉంది. సిబ్బంది పట్టిం చుకోకపోవడంతో నర్సరీలోనే మొక్కలు మూలుగుతున్నాయి.

-స్టేషన్‌ఘన్‌పూర్

గాడితప్పిన పాలన

పాలకుర్తిలో ప్రత్యేక అధికారి లేక కుంటుపడిన అభివృద్ధి

పాలకుర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి పంచాయతీలో నెల రోజులుగా ప్రత్యేకాధికారి లేకపోవడంతో పాలన కుంటుపడింది. సర్పంచుల కాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం ప్రతీ గ్రామానికో ప్రత్యేకాధికారిని నియమించింది. గత నెలలో పాలకుర్తి ప్రత్యేక అధికారిగా ఉన్న డీడబ్ల్యువో జయంతి వరంగల్‌కు బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ఇప్పటికి వరకు ఎవరినీ నియమించలేదు. దాంతోనెల రోజులుగా పాలన కుంటుపడింది. గ్రామ పంచాయతీల్లో నిధులు లేనప్పటికీ సిబ్బంది వేతనాలు చెల్లించడానికి, పంచాయతీ నిర్వాహణ ఖర్చులు ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో జరగాల్సి ఉంది. నెల రోజులుగా సిబ్బంది జీతాలు చెల్లించాలన్నా ప్రత్యేక అధికారి సమక్షంలోనే జరగాల్సి ఉంది. నిధులు లేమికి తోడు ప్రత్యేక అధికారి లేకపోవడంతో వీధి దీపాల నిర్వాహణ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది.



నిర్వీర్యం

పాలకుర్తిలోని గ్రామ పంచాయతీ భవనం

నేడు ఇసుక వేలం

దేవరుప్పుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చిన ఇసుకకు నేడు(బుధవారం) తహసీల్ కార్యాలయంలో ఉదయం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో అక్రమంగా తరలించిన నాలుగు ట్రిప్పుల ఇసుకను పట్టుకోగా, వాటిని వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన



జఫర్‌గడ్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది



పాలకుర్తిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన సిబ్బంది

నిరసన

జఫర్‌గడ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లకు సోమవారం భూసేకరణ నిమిత్తం వెళ్లిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఇతర, రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ రెవెన్యూ అధికారులు మంగళవారం నిరసన తెలిపారు. జఫర్‌గడ్‌లో రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తహసీల్దార్ శంకరయ్య, డీటీ ఖాసీం, ఎంఆర్‌ఐ విష్ణువర్ధన్, ఉద్యోగ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

- పాలకుర్తి: లగచర్లలో కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా ప్రత్యేక అధికారి వెంకటరెడ్డితోపాటు రెవెన్యూ సిబ్బందిపై దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం విధులకు హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫార్మా కంపెనీ ఏర్పాటుకు స్థల సేకరణ కోసం లగచర్లకు వెళ్లగా గ్రామస్తులు దాడి చేయడాన్ని నిరసించారు. కార్యక్రమంలో డీటీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ఐ రాకేష్ ఉన్నారు.
- లింగాలఘణపురం: లగచర్లలో కలెక్టర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ లింగాలఘణపురం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ షకీర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

చెత్తతో సీపీఎం ధర్నా

జనగామ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణం ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని, అయినా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో పేరుకుపోయిన చెత్తను సీపీఎం నాయకులు మంగళవారం తొలగించి, ఆ చెత్తను మునిసిపల్ కార్యాలయం ఎదుట వేసి నిరసన వ్యక్తం చేశారు. కనకారెడ్డి మాట్లాడుతూ జనగామలో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయి, ప్రజలు రోగాల బారిన పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాకర్స్ కోసం ఏర్పాటు చేసిన బతుక మ్మకుంట అసాంఘిక కార్యక్రమాలను అడ్డగా మారిందన్నారు. కార్యక్రమంలో జోగు ప్రకాశ్, దస్తగిరి, కళ్యాణం లింగం, లలిత, బాలమణి, వెంకటేశ్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్ననాయకులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కలెక్టర్‌ను సన్మానించిన టోల్ ప్లాజా సిబ్బంది

రఘునాథపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోమల్ల టోల్ ప్లాజా సిబ్బంది యూనియన్ గౌరవ అధ్యక్షుడు వై.కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మంగళవారం సన్మానించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది యూనియన్ అధ్యక్షుడు ఎండి.సమీర్ ఆలీ, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి పృథ్వీరాజ్, గడ్డం కరుణాకర్, బండి శ్రావణ్, ఎ.రాజు, నగేష్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



యోగేశ్వరస్వామి ఆలయంలో సినిమా షూటింగ్

కొడకండ్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొడకండ్ల మండల కేంద్రంలోని యోగేశ్వరాలయంలో మంగళవారం ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా షూటింగ్ వైభవంగా ప్రారంభమైంది. దర్శకుడిగా నరసింహనాద్రి, ప్రొడ్యూసర్‌గా పరిగి స్రవంతిమాలిక్, దేవుని సురేష్‌లు వ్యవహరిస్తున్నారు. నటీ నటులు విజయ రంగరాజన్, పృథ్వీరజాన్, తిలక్ సదన్, పరిగి నరేష్, భూక్య బాలు, అదితి మోహన, స్వప్న ఉన్నారు. బిగ్‌బాస్ బోలె షావల్ ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. పాలకుర్తి గౌతమ్‌శర్మ పూజలు నిర్వహించారు.

ఘనంగా ఇందిర బర్త్‌డే వేడుకలు

జఫర్‌గడ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగపురం ఇందిర జన్మదిన వేడుకలను జఫర్‌గడ్‌లో మంగళవారం నిర్వహించారు. గాంధీ సెంటర్ వద్ద కేక్‌ను కట్ చేసి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు నీలం రాజయ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కైరిక మల్లయ్య, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి రడపాక రాజ్‌కుమార్, నాయకులు నంచర్ల యాదగిరి, విజయ్ గౌడ్, భాస్కర్, శేఖర్, అశోక్, అఖిల్, ఏజాస్ పాల్గొన్నారు.

- స్టేషన్‌ఘన్‌పూర్: ఇందిర జన్మదినం సందర్భంగా మంగళవారం జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి వడ్లూరి మౌనిక ఆధ్వర్యంలోని హైదరాబాద్‌లో ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు చింత జ్యోత్స్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీలత రెడ్డి, సరిత, మండల ప్రధాన కార్యదర్శి నారగోని పద్మ పాల్గొన్నారు. ఘన్‌పూర్ అంబేద్కర్ సెంటర్ వద్ద కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్, శ్రీనివాస్ రెడ్డి, బొందయ్య, మహేందర్, నాగయ్య, రాజు, వెంకటయ్య, ఎల్లయ్య, పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

టీపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జనగామ కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ జనగామ జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఉమాపతిభవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా నల్లనాగుల రాజు, ఉపాధ్యక్షుడిగా ఇమ్మడి అశోక్, వై.వజ్రయ్య, డి.శారద, యాద శ్రీనివాస్, ఎ.రాజారెడ్డి, సీహెచ్.సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండి.అంకుశావళి, కార్యదర్శులుగా యు.శ్రీహరి, కె.శ్రీరామ్, ఎం.కవిత, ఎం.లక్ష్మణ్‌జీ, బి.వెంకన్న, పి.వెంకన్న, ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్‌గా కుర్రెముల యాదగిరి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.శేషగిరిరావు, అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా జె.రాజేందర్, జీవోల కమిటీ కన్వీనర్‌గా ఎం.ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.



జీడికల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో గోపీరామ్

బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

లింగాలఘణపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడికల్‌లో ఈనెల 14 నుంచి కార్తీక మాస బ్రహ్మోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం జనగామ ఆర్డీవో గోపిరామ్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ అండాలు, ఈవో వంశీ, ఎంపీవో రఘురామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ శివకుమార్, మూర్తి, దేవరాయ రాజు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

పాలకుర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతం కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు వస్తుందని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి లేగ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు శక్తివంచన లేకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్, బాగాల నవీన్‌రెడ్డి, పల్లె కుమార్, ఉపేందర్‌రెడ్డి, మారం రవి, పబ్బ సంతోష్, ఐలోని రామారావు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పాలకుర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని, ఆకతాయిలు వేధిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సైబర్ క్రైం, సోషల్ మీడియాపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు ఆపదలో ఉంటే 100 నంబర్‌కు, మోసానికి గురైతే 1930 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్సై పవన్‌కుమార్ ఎంఈవో పోతుగంటి నర్సయ్య, స్పెషల్ అధికారి నవీన ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో మెడికల్ క్యాంపు

జనగామ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఆర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. రైతులు, సిబ్బంది, హమాలీ, దడువాయిలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, వైస్ చైర్మన్ నర్సింహులు, డైరెక్టర్లు నర్సింగరావు, మోహన్, శ్రీలతరెడ్డి, రమేశ్, బన్సీనాయక్ పాల్గొన్నారు.

సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు స్థల పరిశీలన

తరిగొప్పుల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సబ్‌పోస్టాఫీసు ఏర్పాటు కోసం హన్మకొండ జిల్లా సబ్‌పోస్టు ఆఫీస్ సూపరింటిండెంట్ హన్మంతునాయక్ మంగళవారం తరిగొప్పులలో స్థల పరిశీలన చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయంలో ఓ భవనాన్ని సబ్ పోస్టు ఆఫీసుకు కేటాయించి అందులోవిధులు నిర్వహించేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో మండల నాయకులు అర్జుల సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ పోస్టల్ ఆఫీసర్ జస్వీందర్ సింగ్, దామెర థామస్, మైఖేల్, ప్రభాకర్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లకు సూచనలు ఇస్తున్న ఆఫీసర్

బాలయేసు స్కూల్‌లో కమాండింగ్ అధికారి

దేవరుప్పుల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాలను మంగళవారం వరంగల్ 10టీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సెంథిల్ రామదురై సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్లతో సమావేశమై క్లాసుల గురించి చర్చించి, పనితీరును పర్యవేక్షించారు. అనంతరం ఎన్‌సీసీ మాస్టర్ క్రిష్ణతోపాటు క్యాడెట్స్‌కి పలు సూచనలు చేశారు. అంతకు ముందు కమాండింగ్ ఆఫీసర్ సెంథిల్ రామదురైకి ఎన్‌సీసీ విద్యార్థులు ఘనస్వాగతం పలుకగా, కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్‌మోహన్, మహేష్, మాధవి, అనిత, పాషా, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే

బచ్చన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్వహిస్తోందని అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పోచన్నపేట, బచ్చన్నపేటలో సర్వే తీరును పరిశీలించారు. ప్రజలు సరైన వివరాలతో కూడిన సమాచారం అందించాలన్నారు. మండల పరిధిలో జరుగుతున్న సర్వే తీరును స్పెషల్ ఆఫీసర్ రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లిఖార్జున్‌లు వివరించారు.



వివరాలు సేకరిస్తున్న అదనపు కలెక్టర్

మూలమలుపుల వద్ద చెట్ల తొలగింపు

పాలకుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లు ప్రమాదకరంగా మారండంతో మంగళవారం పాలకుర్తి ఎస్సై పవన్‌కుమార్ నేతృత్వంలో తొలగించారు. ఆయన మాట్లాడుతూ విస్నూరు నుంచి మైలారం గ్రామం వరకు మూలమలుపులు వద్ద చెట్లు ఏపుగా పెరిగాయి. దాంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు డోజర్ సాయంతో చెట్లను తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై లింగారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సోమరెడ్డి పాల్గొన్నారు.

బాలికా సాధికారతను సాధించాలి

లింగాలఘణపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికా సాధికారతను సాధించడంలో ప్రతీ బాలిక ముందుండాలని లింగాలఘణపురం ఎంఈవో పడాల విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం లింగాలఘణపురం జడ్పీహైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి బాలికా సాధికారిక క్లబ్ సభ్యుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలత, విద్యారాణి, డాక్టర్ సుస్మిత, హారిక పాల్గొన్నారు.

మత విద్వేశాలను రెచ్చగొడుతున్నారు : కనకారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):మత విద్వేశాలను రెచ్చగొడుతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మంగళవారం రంగరాయగూడెంలో సీపీఎం మండల మహాసభలో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్, కొడెపాక యాకయ్య, దైద రాములమ్మ, కత్తుల రాజు పాల్గొన్నారు.

‘ఉపాధి’కి కసరత్తు

(5వ పేజీ తరువాయి)

పూడికతీత, భూ అభివృద్ధి పనులు, భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు, నర్సరీల ఏర్పాటు, పశువుల పాకల నిర్మాణం వంటి పనులను చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి..

ట్రాన్స్‌జెండర్లకు మనోధైర్యం కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధిహామీ పనులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి వివక్ష చూపకుండా ప్రతి ట్రాన్స్‌జెండర్‌కు జాబ్ కార్డును మంజూరు చేసి ఉపాధి హామీలో పనులు కల్పించాలని పేర్కొంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. వీరికి ఆధార్ ఆధారంగా జాబ్‌కార్డును మంజూరు చేయనున్నారు.

పర్యవేక్షణ పెరిగితేనే ..

ఉపాధి పనులపై అధికారుల పర్యవేక్షణ పెరిగితేనే అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. చేసిన పనులకు కొలతలు తీసుకోవడంలో జాప్యాన్ని వీడి త్వరితగతిన ఎంబీ రికార్డులను పూర్తి చేయాలి. చాలా చోట్ల పనిచేసిన కూలీలకు నెలల తరబడి వేతనాలు అందక నిరీక్షించాల్సి వస్తోంది. కూలీలకు వేతన చెల్లింపుల్లో సాంకేతిక కారణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సవరించాలి. సకాలంలో కూలీల ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలి. పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వసతులు, పనిముట్లను అందించాలి.



పనులను పర్యవేక్షిస్తున్న రమేష్

త్వరలోనే కోర్టు సేవలు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): త్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌కు మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సేవలు అందుబాటులోకి రానున్నాయని స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేష్ తెలిపారు. ఘన్‌పూర్‌లో కోర్టు ఏర్పాటుకు కేటాయించిన ఎస్సీ-బీ హాస్టల్ భవనంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవనం సుందరీకరణ పనులు కొద్దిరోజులుగా జరుగుతున్నాయని, రంగులు, విద్యుత్ ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కోర్టు ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.రవీందర్, ఘన్‌పూర్ ఈవో లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా నరేశ్

జఫర్‌గడ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పేదల ఆర్థిక రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా కోనాయిచలంకు చెందిన మరుపట్ల నరేశ్ నియమితులయ్యారు. సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సింగారం ప్రేమ్‌కుమార్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.నరేశ్ మాట్లాడుతూ బాధ్యతతో పేదలు, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ, వారి ఆర్థిక జీవన ప్రగతికి చైతన్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మల్లన్న పాలకమండలిపై సందిగ్ధం

చేర్యాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయపాలకమండలి నియామకంపై సందిగ్ధత వీడలేదు. రెగ్యులర్ ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం దేవాదాయశాఖద్వారా సుమారు 6నెల లక్రితం నోటిఫికేషన్ జారీ చేయడంతో అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటెలిజెన్స్‌వర్గాల ద్వారా వివరాలను సేకరించినా ఫలితం లేకుండా పోయింది. చైర్మన్ కుర్చీపై కన్నేసిన పలువురు గాడపాదర్ల ఆశీస్సులకోసం యత్నిస్తున్నారు. రెడ్డి, గొల్లకురుమల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. గొల్ల, కురుమలు, రెడ్డిలు ఆలయాభివృద్ధిలో కీలకభూమిక వహిస్తున్నారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొనసాగిన సమయంలో రెడ్డి సామాజికవర్గానికే చైర్మన్ పద వని ఎక్కువగా కట్టబెట్టగా, నాగపురి రాజలింగం ఎమ్మెల్యేగా కొనసాగిన సమయంలో దళితుడికి తొలిసారి చైర్మన్ పదవి కట్టబెట్టారు. తదనంతరం పద్మశాలీ, గౌడ, ముదిరాజ్, తదితర వర్గాలకు అవకాశం దక్కింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గొల్ల, కురుమలకే పదవి కట్టబెడుతూ వచ్చారు. గతేడాది డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ రెగ్యులర్ కమిటీ నియమించే అవకాశం లేకపోవడంతో పునరుద్ధరణ కమిటీని నియమిస్తూ ఆ సామాజికవర్గానికి చైర్మన్ కట్టబెట్టారు. గత ఏప్రిల్‌లో గడువు పూర్తవడంతో రెగ్యులర్ కమిటీ నియామకానికి కసరత్తు చేపట్టగా 80 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోని గొల్ల, కురుమ, రెడ్డి సామాజికవర్గాల నేతలు ఎవరికి వారుగా మద్దతు కూడబెట్టుకుని అధిష్ఠానాన్ని పట్టుబడుతున్నారు. జనగామ పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కురుమ సామాజికవర్గానికి చెందడంతో కురుమ సంఘం నేతలు ఆయన సహకారం ఆశిస్తున్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, అతడి తండ్రి అంజన్ కుమార్‌యాదవ్‌లు హైదరాబాదుకు చెందిన తమ అనుయాయులకు పదవి కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. దేవాదాయశాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖపై పలువురు సిద్దిపేట, హైదరాబాదు, మెదక్‌కు చెందిన నేతలు తమకు అవకాశం కల్పించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, జనగామ నియోజకవర్గ ఇంచార్జి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జిమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు రెడ్డి సామాజికవర్గనేతలే కావడం, నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధి అనుయాయులకే చైర్మన్ కట్టబెట్టాలని పావులు కదుపుతుండటంతో ఆయావర్గాల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొంది.

ఈసారీ ఉత్సవ కమిటీయే దిక్కా.!?

వచ్చే డిసెంబరు 29న మల్లన్న కల్యాణం జరగనుండగా, రాజకీయక్రీనీడ నేపథ్యంలో రెగ్యులర్ కమిటీ నియామకంపై అను మానాలు వ్యక్తమవుతున్నాయి. నోటిఫికేషన్ విడుదల చేసి ఆరునెలలు కావస్తున్నా పాలకమండలి నియామకంలో ఎలాంటి కదలిక లేకపోవడం, స్వామివారి బ్రహ్మోత్సవాల గడువు సమీపిస్తున్న తరుణంలో ఉత్సవ కమిటీనే నియమించనున్నారన్న ప్రచారం సాగుతుంది. నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో కురుమ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు చైర్మన్ పదవి ఖరారు చేసినప్పటికీ నోటిఫికేషన్ విడుదల అనంతరం దరఖాస్తు చేసుకోని కారణంతో పాటు రాజకీయ స్థితిగతుల దృష్ట్యా ఉత్సవ కమిటీయే నియమిస్తే ఎలాంటి తలనొప్పి ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో మీమాంసలో పడిపోయారు.